
స్వాతి వారపత్రిక కామెడీ కథల పోటీలో బహుమతి పొందిన కథ.

# ఒక యుద్ధం ఒక సంధి ఒక శాంతి



మా ఇంట్లో అడుగుపెట్టాను. గుడికెళ్ళినట్టుగా అన్పించిందో క్షణం.

ఎంతో ప్రశాంతంగా ఉంది. మరెంతో ఆహ్లాదంగా ఉంది.

నిశ్శబ్ద స్వరాలు 'వింటూ' మనస్సు ఆనందం పట్టలేక పిల్లి మొగ్గలేస్తోంటే నిలువునా ఆశ్చర్యబోతూ చుట్టూ చూశాను.

మా ఆవిడ లాప్‌టాప్ ముందు కూర్చుని తదేకంగా తపస్సు చేస్తోంది. మా అమ్మ ఐపాడ్ ఒళ్ళో పెట్టుకుని అక్షరాలు వెదుక్కుంటూ ఏదో టైపు చేస్తోంది.

ఇద్దర్లో ఒక్కరూ నా వంక కన్నెత్తి చూడలేదు. అయినా నా మనస్సంద్రంలో బ్రహ్మానంద కెరటాలు ఉవ్వెత్తున లేచాయి.

'ఇల్లే నందనవనం సుమా' అనుకున్నాను ప్రప్రథమంగా.

'ఏమి హాయిలే హలా అహ ఏమి హాయిలే హలా...' అని చిన్నగా హమ్ చేస్తూ స్టెప్స్ వేస్తూ గదిలో కెళ్ళాను.

అదే మూడ్‌లో 'పగలే వెన్నెలా జగమే ఊయల...' అని బాత్‌రూంలో పాడుకుంటూ స్నానం చేశాను.

ఒళ్ళు అక్షరాలా గాలిలో తేలిపోతోంది. డాన్స్ చెయ్యాలన్న కోరికను బలవంతాన అణచుకుంటూ ఈల వేస్తూ హాల్లోకొచ్చాను.

ఆవిడా, అమ్మా 'యాజ్ ఇటీజ్' పొజిషన్లో ఉన్నారు.

ఆఫీసు నుంచి వచ్చి ఫ్రెషప్ అయ్యాక చిక్కని కాఫీ తాగటం అలవాటు. ఇద్దర్లో ఎవరైనా ఇస్తారేమోనన్న పేరాశతో చిన్నగా దగ్గేను.

"చేతులు ఖాళీ లేవు. టీ పెట్టుకుని తాగండి" అంది ఆవిడ లాప్‌టాప్‌లోంచి తలెత్తకుండానే.

"ఆవిడ గారి బడాయికేంలే గాని టీ కాచుకోలేవు. స్టౌ మీద వేడినీళ్ళున్నాయి. ఇన్ని నీళ్ళలో తేనె కలుపుకుని టీ బ్యాగ్ వేసుకుని గ్రీన్ టీ తాగరా నాయనా. గ్రీన్ టీ ఆరోగ్యానికెంతో మంచిదని డాక్టర్లు బల్లగుద్ది చెబుతున్నారు" అంది అమ్మ నా వంక చూడకుండానే.

'బావుంది వీళ్ళ వరస!' చిన్నగా నవ్వుకుంటూ కిచెన్లో కెళ్ళి గ్రీన్‌టీ కలుపుకుని తెచ్చుకున్నాను. నేను వారిద్దరికీ సమాన దూరంలో కూర్చుని సిప్ చేస్తున్నా ఒక్కరూ పట్టించుకోలేదు.

ఇదివరకిద్దరూ టీవీ రిమోట్ గురించి పోట్లాడుకునే వారు. ఒకరు సీరియల్ చూడాలంటే మరొకరు సినిమా కార్యక్రమం చూస్తాననేవారు. అవి చూడటం కన్నా 'మంత్ర దండం' కాదు కాదు 'అధికార దండం' తమ చేతిలో ఉండాలన్న తాపత్రయమే వారి వాదనలో కనిపించేది. ఇహ కూరల గురించి, పనిమనిషి గురించి ఇల్లు చక్కదిద్దటం గురించి ప్రతి దాని గురించీ కాట్ల కుక్కల్లా కొట్లాడుకునే వారు. ఒక్కోసారి వాళ్ళ గొడవ తీర్చలేక నా తల ప్రాణం తోకకొచ్చేది.

ఇహ ఒకరి మీదొకరు చెప్పే చాడీలూ సాధింపులూ ఓ 'అంతులేని కథ' లక్షాయాభై వేల ఎపిసోడ్ల టీవీ సీరియల్.

ఇంటికి రావడం ఆలశ్యం కాసిని మంచినీళ్ళు నా మొహాన పోయకుండానే ఒకరి మీదొకరు ఫిర్యాదులు 'విసిరే' వారు. దెప్పుకునే వారు. అరిచేవారు. ఒకరి గతం ఒకరు తవ్వేవారు. ఇటు పుట్టింటి వారినీ అటు అత్తింటి వారినీ కూడా జుట్టు పట్టుకుని మరీ సంభాషణల్లోకి ఈడ్చు కొచ్చేవారు.

ఆనక బిగ్గరగా అరిచేవారు. కళ్ళనీళ్ళు పెట్టుకునే వారు. అనంతరం ఒకరు అలక పాన్పు ఎక్కితే రెండోవారు వంటింటి పాత్రలతో బ్యాండ్ వాయించేవారు.

నా తలబొప్పి కట్టేది. తలపోటు మాత్రలు పన్జేసేవే కాదు. 'ఎక్కడికైనా పారిపోతే బావుణ్ణు. అమాంతం మాయమైపోగలిగితే బావుణ్ణు' అనుకునే వాడ్ని. కాని నాకంత అదృష్టం లేకపోయేది.

ఇంతలో ఓ అద్భుతం జరిగింది.

ఇంట్లో నా చేత అదనంగా ఆఫీసు పనిచేయించుకోవాలని మా ఆఫీసు వాళ్ళు నాకు ల్యాప్‌టాప్ ఇచ్చారు. మరి తప్పక నెట్ కనెక్షన్ పెట్టించాను.

మెల్లగా యాహూ మెయిల్ గురించీ, గూగుల్ సెర్చి గురించీ ట్విట్టర్ గురించీ ఫేస్‌బుక్ గురించీ మా ఆవిడ తెలుసుకుంది.

ఇహ చూస్కోండి, 'చూడు నా రాజసం.....' అంటూ మా అమ్మకి ఫోజు కొడుతూ 'నెట్లో' మునిగిపోసాగింది మా ఆవిడ.

అంతటితో ఊరుకుండిపోతే ఈ కథే లేదు.

'వానాకాలం చదువు చదివిన వాళ్ళకేం తెలుస్తుంది నెట్టింట్లోని వైభోగం' 'ఫేసుబుక్కంటే ఫేసు చూసి ముఖం ముట ముట లాడించడం కాదు అదో గొప్ప విద్య'

'ప్రముఖుల ట్వీట్స్ ఫాలో అవడమంటే టీవీ వంటలు చూడటం కాదు' అంటూ తూటాలు పేల్చడం మొదలెట్టింది మా ఆవిడ మా అమ్మని ఉడికించడానికి.

మా అమ్మ ముఖం చెక్కుతీసిన కందగడ్డ అయిపోయేది. లాప్‌టాప్ వంకా దాన్ని ఆపరేట్ చేస్తోన్న నా భార్యవంకా అసూయగా అసహ్యంగా 'మీదపడి రక్కేసి ముక్కలు చేసేయా' లన్నంత కసిగా చూసేది.

'ఇల్లూ వాకిలీ చూసుకోవాల్సిన వాళ్ళకి ఆ కంప్యూటర్లెందుకూ! ఇలాంటి చిత్రం నేనెక్కడ చూళ్ళేదమ్మా!' 'నీ పెళ్లాం వంటా వార్పూ ఎక్కడ పట్టించుకుంటుందిరా నాయనా. ఇరవై నాలుగ్గంటలూ ఆ కంప్యూటర్ సేవతోనే సరిపోతోంది. కోతికి కొబ్బరికాయ దొరికినా ఇంతిలా మురిసిపోదనుకో' 'ఇదెక్కడి చోద్యంరా నాయనా. పొద్దున్నా లేదు సాయంత్రమూ లేదు. ఏ వేళ చూసినా ఆ 'కళ'నే వుంటోందా మహాతల్లి. నువ్వు కొంచెం మందలించరా అబ్బాయ్'

'ఏ పనీ పాటా లేనోళ్ళకి గాని సంసారం చేసుకునే వాళ్ళకి ఈ కంప్యూటరెందుకురా నాయనా. అందులో ఏముంటాయోగాని ఒకటే ఇక ఇకలూ పక పకలూ! అయ్యో సంసారుల కొంపలా లేదురా' – అంటూ రోజూ 'ఆడి' పోసుకునేది అమ్మ.

పన్లోపనిగా లాప్‌టాప్‌కి శాపనార్థాలూ పెట్టేది.

'కొందరికి అంట్లు తోమడమే తెలుసు. నాకు రోజూ ప్రపంచం చుట్టి రావడం తెలుసు' 'ఈ బుల్లిమెషిన్లో ఎన్ని వింతలూ విడ్డూరాలూ ఉన్నాయో తెలుసుకోవాలంటే బ్రహ్మవరం కోసం తపస్సు చెయ్యాల్సిందే' – ఇలా రియాక్టవ్వడం మొదలెట్టింది మా ఆవిడ.

దాంతో రెచ్చిపోయి 'కథాకేళి' ఆడేది. 'గాన కచేరీ' చేసేది మా అమ్మ.

మాటలకన్నా 'చేతలు' ముఖ్యం అనుకున్నట్టుంది మా అమ్మలో మెల్లగా మార్పు వచ్చింది.

"నేనేం తక్కువ తిన్లేదు. ఆ కాలంలోనే నేను ఏడో తరగతి చదివాను. అది ఇప్పటి బీఏతో సమానం తెలుసా! నాకూ అలాంటి బుల్లి కంప్యూటర్ కొనియ్యి" అంటూ కొత్త పాట మొదలెట్టింది మా అమ్మ.

మా ఆవిడ మూతి మూడుసార్లు తిప్పింది. హేళనగా నవ్వి అంది. "దీన్ని ల్యాప్‌టాప్ అంటారని కూడా తెలీదు. ఇది నేర్చేసుకుంటుందిట! ఇది దోసకాయ పచ్చడి చెయ్యడం

కాదు ఎడాపెడా కుమ్మెయ్యడానికి వెనకటికి ఉట్టి కెగరలేనమ్మ ఏకంగా స్వర్గానికి ఎగుర్తానందిట!"

"అబ్బో బడాయి. నేన్నీలాగా కాదు. ఏదైనా సరే సాధించేదాకా నిద్రపోను. ఒరే అబ్బాయ్. నువ్వేం చేస్తావో ఎలా కొంటావో నాకు తెలీదు. నాక్కూడా అచ్చం అలాటిదే కావాలి..."

"దాని ఆపరేషన్ కష్టవేఁ..."

"అది కష్టమైతే తేలికైంది కొనియ్యి...." తేలిగ్గా తేల్చేసి తీర్పు తీర్చేసింది అమ్మ.

నా బుర్రలో 'ఐడియా' వెలిగింది. అమ్మ పుట్టిన రోజుకి ఐపాడ్ కొనిచ్చాను. అమ్మ మురిసిపోయింది. 'నా బుజ్జికొండ. ఎంత బావుందో. చంటిపిల్లలా చేతిలో చక్కగా ఇమిడిపోతోంది..."

మా ఆవిడ అసూయతో మండింది. "మీకావిడంటేనే ఎక్కువ ఇష్టం..." అంది ముక్కు ఎగరేస్తూ.

"అది కాదే..." అని చెప్పబోయినా విన్పించుకోలేదు.

మా అమ్మ ఐపాడ్ ఎలా ఉపయోగించాలో చెప్పమని కూర్చుంది. ఆవిడ పేరన ఫేస్‌బుక్‌లో ఖాతా తెరిచాను. బంధుమిత్రుల్ని ఎలా 'యాడ్' చేసుకోవాలో చెప్పాను. సందేశం తెలుగులో టైపు చేసి 'పేస్టు' చెయ్యడమూ నేర్పాను.

నాలుగే నాలుగు రోజుల్లో నేర్చేసుకుంది అమ్మ. ఇహ చూసుకోండి ఫేస్‌బుక్కు 'ముఖారవిందం' తప్ప మిగతా వాటి వంక కన్నెత్తి చూడటం మానేసింది.

అమ్మకి ఫేస్‌బుక్కే బ్రహ్మ, ఫేస్‌బుక్కే విష్ణు, ఫేస్‌బుక్కే మహేశ్వర అయిపోయింది.

అటు మా ఆవిడ ఇటు మా అమ్మ ఫేస్‌బుక్ 'మత్తు'కు బానిసలై పోయారు.

వారి మధ్య గొడవల్లేవు. ఘర్షణల్లేవు. మాటల యుద్ధాలు అసలే లేవు.

ఎవరి లోకం వారిది. ఎవరి రాజ్యం వారిది. వారి రాజ్యాలకు వారే మహారాణులు!

ఈ అనధికార సంధి ఎన్నాళ్ళు కొనసాగుతుందో తెలీదు గాని ప్రస్తుతానికి నాకు మనశ్శాంతిగా ఉంది. మా ఇల్లు శాంతినికేతన్‌లా ఉంది.

"తాగేసిన కప్పు ఎదురుగుండా వదిలేశారెందుకూ తీసుకెళ్ళి సింక్‌లో పడెయ్యండి. ఈ ఇంట్లో తిని కూర్చునే వాళ్ళే గాని ఒక్కరూ ఒక్క పనీ చెయ్యరు" రుస రుస లాడింది మా ఆవిడ.

"ఓసోస్. ఇంటి పనీ ఓ పనేనా. వయసులో ఉన్నప్పుడు అరగంటలో ఎడం చేత్తో చేసేసే దాన్ని ఇంతకు రెట్టింపు పని!" అందుకుంది అమ్మ.

"మీరే చేశారో ముసలావిడ నెత్తి మీదకి తోసేశారో ఎవరు చూశారూ!" అంది నా శ్రీమతి.

"నేన్నీలాగా కాదు అత్తని దేవతలా చూసే దాన్ని. ఆవిడ చెప్పినట్టు చేసే దాన్ని. ఆవిడకి నచ్చేట్టు మసిలేదాన్ని తెలుసా?!" అంది మా అమ్మ.

"మీరూ దేవతలా ఓ మూలన కూర్చుని కళ్ళెట్టుకుని చూస్తూ ఉండి పోక ఈ నోరు పారేసుకేవడాలెందుకో!"

వారి మాటలు మరింత ముదరకుండా లేచి గదిలోకి వెళ్ళిపోయాను.

పీసీ ఆన్ చేసి మెయిల్ చెక్ చేసుకున్నాక ఫేస్‌బుక్‌లో కెళ్ళాను.

బోల్డన్ని ఫొటోలూ మెస్సేజ్‌లూ పేరుకుపోయి ఉన్నాయి. తీరిక ఉండక గత పది పదిహేను రోజులునుంచి ఎఫ్‌బీ వంక కన్నెత్తి చూళ్ళేదు.

ఒకచోట 'శాంతి' మెస్సేజ్ చూసి ఉలిక్కిపడ్డాను.

'నాకు మనశ్శాంతి లేకుండా పోయింది. దానిక్కారణం ఒక స్త్రీ. ఆవిడ వల్ల నా కాపురం ఏమైపోతుందోనని భయంగా ఉంది. ఆవిడ్నేం చెయ్యాలో తోచటం లేదు'

అదీ శాంతి పెట్టిన మెస్సేజ్.

దాని మీదొచ్చిన కామెంట్లు చూసి అదిరిపడ్డాను.

"ఎవరా స్త్రీ? మెడబట్టి బయటికి గెంటెయ్. నీకు సపోర్టుగా నేనున్నాను"

"సీతారాముల మధ్య శూర్పణఖా? నువ్వే లక్ష్మణుడివై ఆవిడగారి. ముక్కూ చెవులూ కోసి పారెయ్"

"ఇలా పోస్టు చెయ్యడానికి సిగ్గు లేదూ? నువ్వు చదువుకో లేదూ? మన సుఖ సంతోషాలని కొల్లగొట్టేది ఆడా మగా ఎవరైనా సరే వాళ్ళు మన శత్రువే. వెంటనే ప్రత్యేకమైన ఆయుధం ప్రయోగించు"

"సిగ్గు సిగ్గు! ఈ క్షణమే ఆవిడ్ని బంగాళాఖాతంలోకి విసిరెయ్"

ఇలాటివే ఎన్నో కామెంట్లున్నాయి. ఇక 'లైక్'లు ఓ నలభై ఉన్నాయి. మరందులో ఏం నచ్చిందనో ఈ లైకులు! ఆఖరికి ఫలానా వాడు చనిపోయాడని మెస్సేజ్ పెట్టినా 'లైక్'లు కొట్టేసేట్టున్నారు ఖర్మ!

మరోచోట సంధ్యాదేవి 'పోస్టింగ్' కనబడింది. ఆత్రంగా చదివాను.

"ఈ నాటి యువతులు మరీ దూకుడుగా ఉన్నారు. పెద్దలంటే మంచీ మర్యాదా, గౌరవం భక్తీ లేకుండా పోయాయి. వాళ్ళకి తోచదు. పెద్దలు చెప్పేది వినరు. అలాంటి ఓ యువతి వల్ల ఇంట్లో నా బతుకు దుర్భరమయ్యింది!"

దీనికి 78 లైకులు, ఎన్నో కామెంట్లూ వచ్చి పడ్డాయి.

"ఇదంతా విదేశీ విషసంస్కృతి వల్ల వచ్చిపడిన అనర్థం. భరించక తప్పదు"

"ఎవరో యువతి నీ ఇంటిని నరకం చెయ్యడమేవిటి నాన్సెన్స్. ఆమెకి ఆమె స్థానం ఏమిటో చూపించు. నీ అధికారం ప్రదర్శించి నువ్వే గృహ సామ్రాజ్ఞివని చాటుకో"

"కుసంస్కారులను సంస్కరించటం మన బాధ్యత. ఓపికగా బోధించు. ఇవాళ గాకపోతే రేపు తెలుసుకుంటారు"

"అలసత్వం బేలతనం వద్దే వద్దు. గాజులు తొడుక్కున్న చేతులు గజ గజ వణికించగలవని ఋజువు చెయ్యి. బ్రేవో మైడియర్ సంధ్యాదేవి. నువ్వు ఉదయ సంధ్యవి. చీకట్లని పారద్రోలెయ్. సమస్యల్ని తరిమేసెయ్. విజయం నీదే"

ముసుగులో గుద్దులాట గుర్తొచ్చింది. నవ్వుకుంటూ ముందు కెళ్ళాను.

మరో చోట 'శాంతి' కామెంట్ దర్శన మిచ్చింది.

"ఆవిడ 'మూడో' మనిషి కాదు. నాకు మూడించడానికి ముందే పుట్టిన మా అత్త. ఆవిడతో సర్దుకుపోలేకుండా ఉన్నాను. ఆవిడ్నెలా సాగనంపాలో తెలీటం లేదు. వంగేకొద్దీ వీపెక్కి సవారీ చెయ్యాలని చూస్తోంది. తగుదునమ్మా అంటూ అన్నిట్లో వేలూ నోరూ పెడుతోంది. ఆవిడ్ని భరించడం ఆవిడతో కలిసి ఒకే ఇంట్లో ఉండటం సాధ్యంగావట్లేదు. ఈ పీడ ఎలా తొలగించుకోవాలో! ఆవిడకి త్వరగా మూడితే బావుణ్ణు.....!"

దీనికి 112 లైకులొచ్చాయి. కామెంట్లూ చాలానే ఉన్నాయి.

"అత్తగారా! నివారించ వీలులేని దౌర్భాగ్యం! భరించక తప్పని దెయ్యం! ఏం చేస్తాం"

"అత్తలంతా ఇంతే. అత్త లేని కోడలిదే అదృష్టం! వైభోగం! ఆ కోడలు ఉత్తమురాలు!"

"అత్తలేని సంబంధమే మా అమ్మాయికి చెయ్యాలని అది పుట్టినప్పుడే నిర్ణయిం చేసుకున్నాను"

"ఆవిడకి ఇంకో కొడుకో కూతురో ఉంటే అక్కడికి తరిమెయ్యడమే నీ సమస్యకి పరిష్కారం"

"బెస్ట్ సొల్యూషన్ ఏమిటంటే ఆవిడున్నా లేనట్టుగా భావించడమే. ఆమె ఉనికిని పట్టించుకోకుండా నీ గొడవ నువ్వు చూసుకోడవమే"

వీళ్ళు మనస్ఫూర్తిగా గాక తమ 'అక్కసు'ని కామెంట్లుగా కక్కుతున్నారన్పించింది.

ఇంకోచోట సంధ్యా దేవి నోటిఫికేషన్ కన్పించింది. దానికి 145 లైకులూ లెక్కలేనన్ని కామెంట్లూ వచ్చి పడ్డాయి. జనానికి ఫేస్‌బుక్కే లోకమై పోయినట్టుంది. ఇలా అయితే పాపం అత్తాకోడళ్ళ కసి కుట్రల సీరియళ్ళేమై పోవాలి!

"కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడుతుంది. ఎంతైనా ఆ యువతి నా కోడలు. నయానో భయానో చేతికింద ఉంచుకుందామంటే కుదరటం లేదు. సమస్యనెలా పరిష్కరించుకోవాలో బోధపట్టంలేదు"

దానికేం కామెంట్లొచ్చాయంటే...

"కోడలా కోడలా కొడుకు పెళ్లామా అనుకోవడమే!"

"కోడళ్ళంతా రాక్షసులే. అత్తల్ని రాచిరంపాన పెట్టడమే వారి ఏకసూత్ర కార్యక్రమం"

"కొడుకు మూగి అయితే కోడలు ఇల్లెక్కి కూస్తుంది అని సామెత ఒకటుంది"

"అత్త ఉత్తమురాలవ్వాలంటే కోడలు ఉండనే కూడదు..."

"కుదిర్తే చెప్పుకింది తేలులా తొక్కి పట్టాలి. లేదా కోడలి చెప్పులు నెత్తిమీద పెట్టుకుని మోయాలి. దీనికంటే బెస్ట్ ఉపాయం ఇండియాలో లేనే లేదు"

"మనవడో మనవరాలో పుట్టేదాకా ఓపిక పట్టు. వాళ్ళని అస్త్రాలుగా మలిచి కోడలి మీద ప్రయోగించు. ఆ దెబ్బకు కోడలు ఠా నీ పని హాయ్"

నా కళ్ళు గిరగిరా తిరిగాయి. ఇదేం మునలమో అర్థం కాలేదు. టీకప్పులో తుపానులా ఫేసుబుక్కులో సునామీ!

అన్నట్టు శాంతి నా భార్య. సంధ్యాదేవి మా అమ్మ.

వాళ్ళిద్దరూ నన్ను ఫ్రెండ్‌గా చేర్చుకున్నారు గాని వాళ్ళు ఒకళ్ళనొకళ్ళు ఫ్రెండ్‌గా ఉంచుకోలేదు.

అంచేత ఒకరి మెస్సేజ్ మరొకరు చదివే అవకాశం లేకపోయింది. లేకపోతే ఆ రెండు కొప్పులూ కలిసి మినీ కురుక్షేత్రం సృష్టించి ఖచ్చితంగా నా కొంప కొల్లేరు చేసేసేవి సుమా!

ఇక నేనే పూనుకోవాలి. రంగంలోకి దిగిపోయి ఏదోటి చేస్తే తప్ప వారిద్దరి మధ్య సామరస్యం వెల్లి విరియదని రూఢి అయిపోయింది.

బాగా ఆలోచించి ఫేస్‌బుక్ ద్వారానే ఇద్దరి వ్యాఖ్యానాలకీ కామెంట్లు ద్వారా సలహా ఇచ్చాను.

"మీరు ఇవాళ అత్త అయ్యారు గాని మొన్నటి వరకూ కోడలే అని గుర్తుంచుకోండి. మీ అబ్బాయి సుఖ సంతోషాలు నిజంగా కాంక్షిస్తోంటే అతడ్ని బాధించకూడదనుకుంటే మీ కోడల్ని 'అర్థ కొడుకు'గా చూడటం నేర్చుకోండి" అని మా అమ్మకీ,

"మీరు మీ భర్తని మనస్ఫూర్తిగా ప్రేమిస్తోంటే అతడి తల్లినీ ప్రేమించడం నేర్చుకోండి. ఆమె మీ భర్తకు జన్మనిచ్చిన అమ్మ అని మర్చిపోకండి. రేపు మీరూ అమ్మ అవుతారు. మీకూ కోడలు వస్తుంది. మీరూ అత్త అవుతారు" అని శాంతికీ పంపేను.

బయటి వారెవరో పంపినట్టు పంపేశాక నాలిక్కరచుకున్నాను. నా కామెంట్‌తో బాటు నా పేరూ వస్తుందిగా! ఎవరు పంపేరో తెలుస్తుందిగా!

చిత్రం. ఇద్దరూ తేలు కుట్టిన దొంగల్లా ఉండిపోయారు. అదో తారకమంత్రంలా పనిచేసింది.

బహుశా నా బాధ, వేదన నా అక్షరాల్లో వారికి కన్పించి ఉంటుంది.

మా ఇంట్లో శాంతి సామరస్యాలు వేరూని గబగబా ఆకులూ మొగ్గలూ తొడగటం మొదలెట్టాయి.

ఇది విచిత్రం మాత్రం కాదు సుమా! ఇది బతుకు మాయ!

(స్వాతి వారపత్రిక **19.9.2014**)